
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



శిక్షణకు సిద్ధం

కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉద్యోగుల శిక్షణ కేంద్రం, ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. 10లో



పశువుల బీమా ఏది?

పశువుల బీమా పథకం అమలును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 19°

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గురువారం ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, బుధవారాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

తొలిమెట్టు రికార్డుల పరిశీలన

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎస్‌సీఈఆర్‌టీ బృందం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

మణుగూరు రూరల్ : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర స్థాయి ఎస్‌సీఈఆర్‌టీ కో ఆర్డినేటర్ శ్రీధరాచార్యులు, ఎఫ్ఎంఎన్ రాష్ట్ర వనరుల బృంద సభ్యులు వీ.వీ. కోటేశ్వరరావు, ఎస్.రాజశేఖర్ బుధవారం సందర్శించారు. మద్దులగూడెం, రామానుజవరం పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రామానుజవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే విధానంపై పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి జి నాగశ్రీ, ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ఎస్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

28 వరకు దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు అభ్యర్థులుగా ఐటీఐ పరీక్షలు రాసేందుకు ఈనెల 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గోనెల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలైలో జరిగే పరీక్షలకు అర్హత గల సర్వీస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు వివరించారు. వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన సూర్య నమస్కారోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు


కొత్తగూడెంటౌన్: పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో జనవరి 22న ప్రారంభమైన సూర్య నమస్కార ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున మహా సౌర అరుణహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ సులోచన తదితరులు పాల్గొన్నారు.

కొలువు.. సులువంటూ..





సింగరేణి ప్రధాన కార్యాలయం



'కారుణ్యం'లో వసూళ్లకు పాల్పడుతున్న కాలకేయులు

- ఫైల్ కదిలిస్తామంటూ రూ.లక్షల్లో బేరసారాలు
- దళారుల దందాతో నష్టపోతున్న కార్మికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాలం మారినా డిమాండ్ తగ్గని సింగరేణిలో కొలువుల కోసం రెగ్యులర్ నోటిఫికేషన్ల కంటే కారుణ్య నియామకాలే సులువనే అభిప్రాయం నెలకొంది. దీంతో తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు కార్మికులు సుముఖంగా ఉంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని దళారులతో పాటు కొందరు కార్మిక సంఘాల నేతలు పెద్ద ఎత్తునఅక్రమ దందాకు తెర లేపుతున్నారు.

ఒకప్పుడు తెలంగాణలో ఉపాధి అవకాశాలు అంటే దుబాయి, ముంబయి, బొగ్గుబాయి అన్నట్టుగా ఉండేది. తర్వాత కాలంలో ఐటీ పరిశ్రమ పుంజుకోవడం, ప్రైవేటు సెక్టారులో ఉపాధి అవకాశాలు ఏర్పడిన తర్వాత సింగరేణిపై కొంత ఒత్తిడి తగ్గింది. అయినప్పటికీ గోదావరిలోయ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఇప్పటికీ సింగరేణి సంస్థనే ప్రధాన ఉపాధి వనరుగా ఉంది. కాగా, ఈ శతాబ్దం ఆరంభం నుంచి మ్యాన్ పవర్ తగ్గించుకోవడంపై సింగరేణి సంస్థ దృష్టి సారించింది. దీంతో లక్షకు పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం 40 వేలకు పడిపోయింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం సింగరేణి సంస్థలో పెద్దగా నియామకాలు చేపట్టలేదు. 2015లో ఒకసారి, ఆ తర్వాత 2017లో నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వీటి ద్వారా సుమారు 4,700 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఆ తర్వాత పలు నోటిఫికేషన్లు వెలువడినా వివిధ కారణాలతో భర్తీ ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఇప్పటి వరకు 14,922 మందికి ఉద్యోగాలు వచ్చాయి. రెగ్యులర్ నోటిఫికేషన్ల ద్వారా జరుగుతున్న భర్తీ కంటే కారుణ్య నియామకాల ద్వారా మూడు రెట్లు అధికంగా కొత్త ఉద్యోగులు సంస్థలోకి వచ్చారు.

ఒత్తిడి తెస్తున్నారు..

కార్మికుల బాగోగుల కోసం అహర్నిశలూ కృషి చేసిన కార్మిక సంఘాల నాయకులు ఎంతోమంది సింగరేణి చరిత్రలో ఉన్నారు. ప్రాణత్యాగం చేసిన వారికీ కొదువ లేదు. ఇలా ఎందరో మహానేతలకు ఆశ్రయమిచ్చిన సింగరేణిలో ప్రస్తుతం కొందరు నాయకులు పూర్తిగా పైరవీలకే అంకితమయ్యారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఉండే అధికారుల్లో కొందరిని తమకు అనుకూలంగా మార్చుకుని చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. తాము చెప్పిన డీల్‌కు సై అంటేనే కారుణ్య నియామకం ఫైల్ ఓకే అవుతుందని, లేదంటే ఆ పని జరగదని నేరుగా చెప్పేస్తున్నారు. వీరి తరఫున ప్రత్యేక దళారుల టీమ్ నిత్యం సంప్రదింపులు చేస్తోంది. దీంతో వీటికి ప్రభావితమై కొందరు, ఈ ఒత్తిడి తట్టుకోలేక మరికొందరు కారుణ్య నియామకాల కోసం అప్పనంగా లక్షల రూపాయలు ముట్టచెబుతున్నారు. ఏళ్ల తరబడి కారుణ్య నియామకాల్లో పెనవేసుకుపోయిన అవినీతి, దాన్ని పెకిలించేందుకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే కావడంతో దళారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కార్మికులు తమ శ్రమార్జితాన్ని అన్యాయంగా నష్టపోతున్నారు. ఈ విషయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దందాపై ఇప్పటికైనా సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

గడిచిన రెండేళ్లలో..

2018 మార్చి నుంచి 2023 జనవరి చివరి వరకు పరిశీలిస్తే 96 సార్లు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తం 18,966 మంది కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 11,175 మందిని అన్‌ఫిట్‌గా గుర్తించారు. వారి వారసులు 9,861 మందికి కారుణ్య నియామక కోటాలో ఉద్యోగాలు వచ్చాయి. వీరిలో సగం మంది కరోనా అనంతర పరిణామాల్లో వాస్తవంగానే శారీరక సామర్థ్యం కోల్పోవడం, అనారోగ్యం బారిన పడిన వారు ఉన్నారు. ఒక్క రూపాయి కూడా అక్రమ పద్ధతిలో చెల్లించకుండా వీరి వారసులకు ఉద్యోగాలు రావాల్సి ఉంది. కానీ, అన్ని అర్హతలు ఉన్నా దళారుల ముసుగులో ఉన్న నేతలు చెప్పినంత సొమ్ము సమర్పించుకోకుంటే తమ వారసులకు అన్యాయం జరుగుతుందేమో అనే భయం సంస్థ వ్యాప్తంగా ఉన్న కార్మికుల్లో నెలకొంది.

చివరిదశలో పోడు పట్టాల ప్రక్రియ

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోడుపట్టాల పంపిణీ ప్రక్రియలో పాలిగన్ మ్యాపులు తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అనుదీప్ రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో బుధవారం పోడు లబ్ధిదారుల ఫొటోల సవరణ, పాలిగన్ మ్యాపుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు పట్టాల ప్రక్రియ చివరిదశకు చేరిందని చెప్పారు. లబ్ధిదారుల ఫొటోతో పాటు విస్తీర్ణంలో సవరణల ప్రక్రియను తక్షణమే పూర్తిచేయాలని అన్నారు. ఫొటోలు, విస్తీర్ణంలో వ్యత్యాసాలను సవరించే అంశంపై తహసీల్దార్లు, ఎంపీడీఓలకు పవర్‌పాయింట్ ప్రజెంటేన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పారదర్శకంగా విచారణ చేపడతాం

ఉపాధి హామీ పథకం పనుల్లో సోషల్ ఆడిట్ నేరాలపై పారదర్శకంగా విచారణ చేపడతామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంతరావు బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విచారణ చేపట్టిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిష్కరించిన అంశాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని డీఆర్‌డీఓ, ఇతర అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఏపీడీ సుబ్రహ్మణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల విన్యాసం..

మణుగూరుటౌన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని సింగరేణి మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. స్థానిక సింగరేణి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బడేన్ పోవెల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ.. యువత స్నేహభావం, సేవా దృక్పథంతో జాతి సేవకు అంకితమయ్యేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని పోవెల్ స్థాపించారని తెలిపారు. ఆపద కాలంలో ధైర్య సాహసాలు చూపడం వంటి గుణాలతో జాతి సేవలో నిమగ్నమై ప్రత్యక్షంగా సమాజానికి, పరోక్షంగా దేశానికి అమూల్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. సమాజసేవ చేయాలనే ఆలోచన చిన్ననాటి నుంచే రావాలన్నారు. అనంతరం సింరగేణి పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి. స్కౌట్స్ విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. అనంతరం సింగరేణి పాఠశాల నుంచి పీవీ కాలనీ వరకు శాంతి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, గుర్తింపు సంఘం నేత ప్రభాకర్‌రావు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హసీనా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు

డీఎంహెచ్‌ఓ శిరీష



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, వార్డులు, ల్యాబ్, మందుల గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణపై సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమయపాలన పాటించకున్నా, విధుల పట్ల అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్..

జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించే నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ కంట్రోల్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిందని వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక తెలిపారు. గత డిసెంబర్ 16, 17 తేదీల్లో పీహెచ్‌సీని కేంద్ర బృందం సందర్శించి ఆస్పత్రి పరిసరాలు, మందులు, పరీక్షల గది, టీకాల నిల్వ గది, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో పీహెచ్‌సీకి 85 శాతం మార్కులు కేటాయించారని ప్రియాంక వెల్లడించారు. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ సాధించడం పట్ల డీఎంహెచ్‌ఓ శిరీష పీహెచ్‌సీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఐఓ ప్రోగ్రామ్ అధికారి బాలాజీ, ఎంసీహెచ్ చైతన్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గట్టుమల్లలో వైద్య బృందం పర్యటన..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గట్టుమళ్లలో ఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండిజినీస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ క్లినిక్‌ను జిల్లా వైద్య బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు డీఎంహెచ్‌ఓ శిరీషకు అన్ని ప్రోగ్రామ్‌ల గురించి వివరించారు. గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని, 2022లో ఎలాంటి మాతృ మరణాలు సంభవించలేదని తెలిపారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ఉపయోగించి పిండ పరిమాణం తెలుసుకుంటూ ఎలాంటి తలెత్తకుండా చూస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సుకృత, బాలాజీనాయక్, మణికంఠారెడ్డి, చైతన్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఘనం.. అందని జీతం

- పంచాయతీ కార్యదర్శుల వేతన వెతలు
- రెండు నెలలుగా తప్పని ఇక్కట్లు
- 374 మంది జేపీఎస్‌ల ఎదురుచూపులు..



పోడు పట్టాల తయారీలో సేవలందిస్తున్న జేపీఎస్‌లు

చుంచుపల్లి: పల్లెలను ప్రగతిబాట పట్టించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. ప్రతీ నెల జాప్యమే జరుగుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఫిబ్రవరి నెలాఖరుకు వస్తున్నా.. ఇంతవరకూ జనవరి వేతనమే రాలేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో అన్నీ తామై సేవలు అందిస్తున్నా ప్రభుత్వం సకాలంలో వేతనాలు అందించడం లేదని వాపోతున్నారు. గత ఏడాది కాలంగా ఇదే తంతు కొనసాగుతోందని, ఏనాడూ సకాలంలో వేతనం అందుకున్న దాఖలాల్లేవని చెబుతున్నారు. జేపీఎస్‌ల వేతనాలు ఎప్పుడు విడుదలవుతాయో అధికారులకు సైతం తెలియని పరిస్థితి నెలకొంది. పల్లె ప్రగతిలో భాగంగా ఉదయమే గ్రామాలకు చేరుకుని, విస్తృతంగా సేవలు అందిస్తున్న తమకు అండగా ఉంటామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. కనీసం వేతనాలు కూడా రెగ్యులర్‌గా అందించడం లేదని జేపీఎస్‌లు అసంతృప్తిగా ఉన్నారు. ప్రభుత్వం వీరికి ప్రతి నెలా 5వ తేదీ లోపే వేతనాలు చెల్లించాల్సి ఉండగా నెలా 20 రోజులు దాటినా జీతాలు రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాలను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో 380 మంది జేపీఎస్‌లు..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీల పరిధిలో కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరిలో 374 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 107 మంది సీనియర్ కార్యదర్శులు ఉన్నారు. జేపీఎస్‌లలో 140 మంది మహిళా కార్యదర్శులు, ఐదుగురు దివ్యాంగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పనిచేసే జూనియర్ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.28,719 వేతనంగా అందజేస్తోంది. గతంలో రూ.15 వేలు మాత్రమే ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి అమల్లోకి తెచ్చిన పల్లె ప్రగతి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత నాలుగేళ్లుగా పల్లెలను ప్రగతిబాట పట్టించడంలో విశేష కృషి చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు హరిత నర్సరీలు, డంపింగ్‌యార్డుల నిర్వహణ, ఉపాధి హామీ పథకం, మొక్కలు నాటించడం, జనన, మరణ సర్టిఫికెట్ల జారీ, ప్రభుత్వం అప్పగించే వివిధ శాఖల సర్వేలు విజయవంతంగా చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ పంచాయతీల రూపు రేఖలు మార్చడంలో ముందుంటున్నారు. పండగలు కూడా లేకుండా సెలవు దినాల్లోనూ పని చేస్తున్నారు. ఇంత చేస్తున్నా తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని, సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు



సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. దాదాపు రెండో నెల గడుస్తున్నా నేటికీ వేతనాలు అందలేదు. చాలా మంది జేపీఎస్‌లు నెలసరి జీతంపైనే ఆధారపడుతుంటారు. వేతనాలు రాకపోవడంతో అప్పు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి మా జీతాలు సక్రమంగా విడుదల చేయాలి.

–వంశీకృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏఈసీఎస్‌ను సందర్శించిన 'ఆటమిక్' చైర్మన్

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ అణుశక్తి కేంద్రీయ విద్యాలయాన్ని(ఏఈసీఎస్) ఆటమిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వీపీ.వేణుగోపాలన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం వేణుగోపాలన్‌ను భారజల కర్మాగారం ఎంప్లాయిస్ అసోసియేషన్, సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. టీచర్ పోస్టుల భర్తీ, జాతీయ టాలెంట్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో విద్యార్థులు పాల్గొనేలా చూడడంతోపాటు ల్యాబ్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ల బాధ్యులు పొద్య కేశవరావు, వెంకటరెడ్డి, రాయల రాజేష్, రామ్మూర్తి, బాల, విష్ణువర్ధన్‌రాజు, శ్రీనివాసరావు, మోహన్‌బాబు, రస్నుహుస్సేన్, సాహు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: ఎకనామిక్ రిహాబిటేషన్ పథకం (ఈఆర్ఎస్) కింద సబ్సిడీ రుణాల కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి (ఐసీడీఎస్ పీడీ) స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద 2022 – 23 సంవత్సరానికి గాను దివ్యాంగులకు మండలానికి ఒక యూనిట్ చొప్పున మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మొత్తం 30 మందికి రూ.50 వేల చొప్పున రుణాలు అందజేస్తామని తెలిపారు. https: tsobmms. cgg, gov. in వెబ్‌సైట్‌లో ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



మణుగూరు మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్/కరకగూడెం: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. బుధవారం ఆయన మణుగూరు, కరకగూడెం మండలాల్లో పర్యటించారు. మణుగూరు మండలం ముత్యాలమ్మనగర్‌లో అభివృద్ధి పనులకు, ఐటీఐ ప్రాంగణంలో రూ.కోటితో నిర్మించే గ్రంథాలయ భవనం, రూ.1.98 కోట్లతో బీటీపీఎస్ నుంచి పెంటన్నగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ పల్లెను అభివృద్ధి చేసే లక్ష్యంతో సీఎం కేసీఆర్ శ్రమిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు సమితి సింగారంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కరకగూడెం మండలం కలవలనాగారం-కన్నాయిగూడెం గ్రామాల మధ్య రూ.21 లక్షలు, కౌలూరులో రాయనపేట – ఎల్లాపురం మధ్య రూ.2.34 కోట్లు, రేగళ్ల క్రాస్ రోడ్డు నుంచి తుమ్మలగూడెం వరకు రూ.21 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. భట్టుపల్లిలో గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకుని శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు కారం విజయకుమారి, గుమ్మడి గాంధీ, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సర్పంచ్ కొమరం జంపేశ్వరి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, తరుణ్‌రెడ్డి, కుర్రి నాగేశ్వరరావు, కంది సుబ్బారెడ్డి, పొనుగోటి భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆక్రమిత భూమిని ఇప్పించండి..


నిరసన తెలుపుతున్న కొడెం సమ్మయ్య

ఇల్లెందురూరల్: తనకు న్యాయం చేయాలని, లేదంటే చనిపోయేందుకు అనుమతివ్వాని కోరుతూ మాజీ మావోయిస్టు కొడెం సమ్మయ్య బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో పీపీజీలో దళకమాండర్‌గా పనిచేశానని, ప్రభుత్వ పిలుపుమేరకు తుపాకీతో సహా పోలీసులకు లొంగిపోయానన్నానడు. తనకు ప్రభుత్వం పునరావాస పథకం కింద 1.30 ఎకరాల భూమి ఇచ్చిందని, ఆ భూమిని మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా ఆక్రమించాడని తెలిపాడు. ఆ భూమిని తిరిగి ఇప్పించాలని గతంలో అనేకమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందని వాపోయాడు. తనకు ఆ భూమి తప్ప మరో జీవనాధారం లేదని, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో చనిపోయేందుకైనా అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశాడు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

సుజాతనగర్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ పి.తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతల ఆదెమ్మ రోడ్డు దాటుతుండగా ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న వాహనం ఢీకొట్టింది. ఆదెమ్మ అక్కడికక్కడే మృతిచెందగా, వాహనం ఆపకుండా వెళ్లడంతో సీసీ కెమెరా సాయంతో వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మృతురాలి కుమారుడు మధు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన పాల్వంచ మండలం ప్రశాంతినగర్‌కు చెందిన డ్రైవర్ ఫణితి రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

గుండాల: ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మెస్సు రాము (12) గుండాల మండలం కాచనపల్లి (శంభునిగూడెం) గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపై దద్దుర్లు (అమ్మతల్లి) రావడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ నెల 13వ తేదీన తన మేనమామ రామును ఇంటికి తీసుకెళ్లాడు. స్థానిక ఆస్పత్రిలో వైద్యం అందించారు. నోట్లో సైతం దద్దుర్లు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి గతేడాది మృతి చెందాడు. తల్లి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. హాస్టల్లో వైద్యం అందించడంపై హెచ్ఎంను వివరణ కోరగా తలనొప్పి వస్తుందని చెప్పగా స్థానిక సబ్ సెంటర్‌లో చూపించామని, వెంటనే కుటుంబ సభ్యుల ఇష్టం మేరకే పంపించామని తెలిపారు.

గాయపడిన బాలుడు..

పాల్వంచ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు మోనీశ్(9) బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 19వ తేదీన కొత్తగూడెం చిట్టి రామవరానికి చెందిన బానోతు వెంకటయ్య తన చిన్న మనుమడు మోనీశ్‌ను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని పాల్వంచ హాస్టల్‌లో చదువుతున్న పెద్ద మనుమడు తనీశ్‌ను కలిసేందుకు తీసుకెళ్తున్నా డు. ఈ క్రమంలో కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో తాత, మనుమడు గాయపడ్డారు. తీవ్రగాయాలపాలైన మోనీశ్‌ను వెంటనే హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

బూర్గంపాడు: కర్ణాటక రాష్ట్రం మాండ్యా ప్రాంతంలోని కాలువలో నాలుగురోజుల కిందట గల్లంతైన లక్ష్మీపురం గ్రామానికి చెందిన వినయ్‌కల్యాణ్ (25) మృతదేహం బుధవారం లభ్యమైంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న వినయ్‌కల్యాణ్ నాలుగురోజుల కిందట అక్కడి మిత్రులతో కలసి మాండ్యా ప్రాంతంలోని జలాశయం వద్దకు వెళ్లారు. జలాశయం కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయిన కల్యాణ్ గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం నాలుగురోజుల పాటు గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు అతడి మృతదేహం లభ్యమైంది. చేతికందిన కొడుకు కాలువలో కొట్టుకుపోయి మృతిచెందాడనే విషయాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. వినయ్ కల్యాణ్ తల్లిదండ్రులు లక్ష్మీపురంలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బీటెక్ చదివిన కల్యాణ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు అండగా నిలిచాడు. గురువారం అతడి మృతదేహాన్ని లక్ష్మీపురం తీసుకురానున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

పశువుల బీమా ఏది?

గత కొన్నేళ్లుగా నిలిచిన పశువుల బీమా

- ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలతో పశువుల మృత్యువాత
- బాధిత రైతులకు దక్కని పరిహారం


పిడుగుపాటుకు చనిపోయిన గొర్రెల వద్ద యజమానులు (ఫైల్)

బూర్గంపాడు: రైతుబీమా, పంటల బీమాతో రైతులకు భరోసా కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువుల బీమాను మాత్రం గాలికి వదిలేశాయి. గతంలో కొన్నేళ్లపాటు అమలైన పశువుల బీమాను ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. పశువుల బీమా పథకం అమలు కాకపోవడంతో పాడిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లావ్యాప్తంగా ఏటా వందలాది పశువులు మృతి చెందుతున్నాయి. పశువుల బీమా లేకపోవడంతో వాటిపై పెట్టిన పెట్టుబడి అంతా కోల్పోవాల్సి వస్తోంది. ఏరూపంలోనూ వారికి సాయం అందకపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. జిల్లాలో లక్షల సంఖ్యలో పాడిపశువులు, గొర్రెలు, మేకలున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యవసాయంతో పాటుగా రైతులు పాడిపశువుల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పెద్దసంఖ్యలో పశువులు, గొర్రెలు, మేకలను రైతులు పెంచుతున్నారు. పాల ఉత్పత్తులు, మాంసం ఉత్పత్తులతో పెంపకందారులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పరమైన పథకాలలో పేదలకు పాడిగేదెలను రాయితీపై అందిస్తున్నారు. గొల్ల, కురుమలకు రాయితీపై గొర్రెలను పంపిణీ చేశారు. అయితే, వరదలు, పిడుగుపాట్లు, ప్రమాదాలలో ఏటా వేలాది పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఏటా వర్షాకాలంలో పిడుగుపాట్లతో జిల్లాలో వందల సంఖ్యలో గొర్రెలు, మేకలు, పశువులు మృతిచెందుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో కూడా పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో పశువులు, జీవాల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రమాదాలు జరిగి పశువులు, జీవాలు చనిపోయినప్పుడు రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం రావటం లేదు. కేవలం విద్యుదాఘాతంతో పశువులు చనిపోయినప్పుడు మాత్రం విద్యుత్‌శాఖ ఒకింత పరిహారమందిస్తోంది. మిగతా ఎలాంటి ప్రమాదాలలో పశువులు చనిపోయినా సాయం మాత్రం అందటం లేదు.

జిల్లాలోని పశువుల వివరాలు

ఆవులు	2.00 లక్షలు
గేదేలు	1.26 లక్షలు
గొర్రెలు	1.55 లక్షలు
మేకలు	2.00 లక్షలు

కొంతకాలం అందిన బీమా

2009 నుంచి 2018 వరకు పశువుల బీమా పథకం అమలు చేశారు. పాడిరైతులు పశువుల బీమా కోసం కొంత సొమ్ము చెల్లిస్తే, ప్రభుత్వం కొంత బీమా చెల్లించేది. పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే పశుసంవర్ధకశాఖ అధికారులు పంచనామా నిర్వహించి బీమా సంస్థలకు నివేదికలు అందించేవారు. అప్పుడు రైతులకు బీమా కంపెనీలు కొంత పరిహారాన్ని చెల్లించేది. బీమా సొమ్ముతో రైతులు తిరిగి పశువులను కొనుక్కునేవారు. ప్రస్తుతం పశువుల బీమా అమలు చేయకపోవటంతో పాడి


పిడుగుపాటుకు చనిపోయిన ఎద్దులు (ఫైల్)

రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని ప్రైవేట్ బీమా సంస్థలు పాడిపశువులకు బీమా చేస్తున్నాయి. అయితే బీమాకు సంబంధించిన ప్రీమియం మొత్తంను ప్రతి ఏటా రైతులే చెల్లించుకోవాలి. ఏటా పశువులకు బీమా ప్రీమియం మొత్తం చెల్లించే ఆర్థిక స్తోమత రైతులకు లేకపోవటంతో పశువుల బీమాకు ముందుకు రావటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పశువుల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. పశువుల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తే పాడిపరిశ్రమ మరింత వృద్ధిలోకి వస్తుందని రైతులు భావిస్తున్నారు.

బీమా అమలు చేయాలి



ప్రభుత్వం పాడి పశువులకు బీమాను అమలు చేయాలి. వరదలు, పిడుగుపాట్లు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోతున్నాం. కొంత డబ్బులు రైతులు చెల్లిస్తే, కొంత ప్రభుత్వం చెల్లించాలి. పిడుగుపాటుతో గేదెలు, గొర్రెలు, మేకలు చనిపోయిన రైతులకు ఇప్పటివరకు రూపాయి సాయం అందలేదు.

– బూరం భిక్షం, పాడి రైతు

రైతులకు నష్టం జరుగుతోంది



గోదావరి వరదలలో పశువులు చిక్కుకుని చనిపోయాయి. పిడుగులు, రోడ్డు ప్రమాదాల్లోనూ పశువులు మృతిచెందుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రమాదాలు జరిగి పశువులు, జీవాలు చనిపోతే ఆ కుటుంబం వీధిన పడే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం పశువుల బీమాను అమలు చేస్తే భరోసా ఉంటుంది.

– మంత్రి అప్పలనాయుడు, పాడి రైతు

పశువుల బీమా అమలులో లేదు



ప్రస్తుతం పశువులకు ప్రభుత్వ పరంగా బీమా పథకం అమలులో లేదు. అయితే ఇటీవల పశువుల బీమాను అమలు చేసేందుకు ప్రభుత్వపరంగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పశువుల బీమా అమలు చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరిగి పశువులు చనిపోయినా బాధిత రైతులకు ఒకింత ఆర్థిక భరోసా లభిస్తుంది.

– పురంధర్, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి

క్రికెటర్ త్రిషను అభినందించిన ఎమ్మెల్యే


త్రిష, రామిరెడ్డిని అభినందిస్తున్న పొదెం వీరయ్య

భద్రాచలం: అండర్–19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్ సాధనలో భాగస్వామ్యమైన భద్రాచలం ఆడబిడ్డ 'గొంగడి త్రిష'ను ఎమ్మెల్యే పొదెం వీరయ్య బుధవారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. హైదరాబాద్‌లోని త్రిష స్వగృహంలో త్రిషను, ఆమె తండ్రి రామిరెడ్డిని కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించి భద్రాచలం ఖ్యాతిని ఇనుమడింపజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని త్రిష ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చిన రామిరెడ్డి అభినందనీయుడని చెప్పారు. త్రిషను అభినందించిన వారిలో భద్రాచలం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరేళ్ల నరేశ్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, తెల్లం నరేశ్, బూర లక్ష్మీనారాయణ ఉన్నారు.

అంకమ్మతల్లి ఆలయంలో చోరీ

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం అంకమ్మతల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం పూజారి ఆలయానికి వెళ్లేసరికి ఆవరణలో ఉన్న ఓ హుండీ తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. ఈ విషయాన్ని స్థానిక పెద్దలకు సమాచారం అందించడంతో వారు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. హుండీలో సుమారు రూ.50 వేలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్టి, ఇసుక దందాపై ఆగ్రహం

- జిల్లా వ్యాప్తంగా అధికారుల ముమ్మర తనిఖీలు
- జేసీబీలు, ఇతర వాహనాల స్వాధీనం


బూర్గంపాడు : టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు


పాల్వంచ రూరల్ : స్వాధీనం చేసుకున్న టిప్పర్‌తో అధికారులు

బూర్గంపాడు/అశ్వారావుపేట రూరల్/పాల్వంచ రూరల్: జిల్లావ్యాప్తంగా ఇసుక, మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. పలుచోట్ల ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీ డ్రైవర్ల అతివేగం, నిర్లక్ష్యంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి తోడు రహదారులు ఛిద్రమవుతున్నాయనే ఫిర్యాదులతో ఎట్టకేలకు అధికారులు రంగంలోకి దిగారు. ఈమేరకు జిల్లాలోని బూర్గంపాడు, అశ్వారావుపేట, పాల్వంచ తదితర మండలాల్లో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బూర్గంపాడు మండలంలోని పోలవరం సమీపాన ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మట్టి తవ్వుతున్న జేసీబీ, మట్టిని తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. వారం క్రితం సీతారామ ప్రాజెక్టు మట్టిని తరలిస్తున్న జేసీబీ, లారీలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం ప్రస్తుతం జేసీబీ, మూడు లారీలను స్వాధీనం చేసుకుని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించింది. ఈ ఘటనపై తహసీల్దార్‌కు నివేదిక అందజేసినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఇక అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామ సమీపాన వాగు నుంచి అనుమతి లేకుండా కొందరు నాలుగు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయమై 'మన ఇసుక – మన వాహనం' ట్రాక్టర్ల యజమానులు స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యాన అశ్వారావుపేటలో ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్‌కు తరలించారు. ఈ అంశంపై విచారణ జరుపుతున్నట్లు తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. అలాగే, పాల్వంచ మండలంలోని తోగ్గూడెం క్వారీల నుంచి అనుమతి లేకుండా మట్టి, రాళ్లు రవాణా చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంతో ఆయన ఆదేశాల మేరకు బుధవారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు క్వారీల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మట్టి, రాళ్లు తరలిస్తున్న రెండు పొక్లెయినర్లు, ఒక టిప్పర్, బ్రేకర్‌ను అధికారులు సీజ్ చేశారు. తనిఖీల్లో ఏడీఈ జైసింగ్, సీఐ నాగరాజు, ఆర్ఐ హచ్చా పాల్గొన్నారు.


జామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్‌కు చెందిన ఓ జామాయిల్ తోటలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కేశప్పగూడెం గ్రామ సమీపంలోని రాష్ట్ర కార్పొరేషన్‌కు చెందిన 22 హెక్టార్ల జామాయిల్ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. అగ్ని ప్రమాదంలో కొన్ని జామాయిల్ చెట్లు కాలిపోగా, సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న సత్తుపల్లి ఫైర్ స్టేషన్ ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణప్రసాద్, సిబ్బంది వెంకటేశ్వరరావు, బాబూరావు, గోపి ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

జూలూరుపాడు: జూలూరుపాడు పీఏసీఎస్ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్ రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు తొమ్మిది మంది డైరెక్టర్లు బుధవారం జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వెంకటరెడ్డి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గూటికి చేరడంతో అతడిపై అవిశ్వాసానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ఈ సొసైటీలో 13 వార్డులు ఉండగా 9 బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్ ఒకరు చొప్పున ఉన్నారు. సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు బీఆర్ఎస్‌లోని రెండు గ్రూపుల వారు పోటీ పడ్డారు. వెంకటరెడ్డి గ్రూపులో ఏడుగురు, యల్లంకి సత్యనారాయణ గ్రూపులో ఆరుగురు డైరెక్టర్లు ఉండడంతో నాడు ఎన్నిక అనివార్యమైంది. 2020 ఫిబ్రవరి 16న ఎన్నికలు నిర్వహించగా లేళ్ల వెంకటరెడ్డితో పాటు కొమ్మినేని పాండురంగారావు అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుడిగా వెంకటరెడ్డి గ్రూపు నుంచి చీమలపాటి భిక్షం(సీపీఎం), సత్యనారాయణ గ్రూపు నుంచి మనుబోలు తిరువెంగళరాజు(టీడీపీ) నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చీమలపాటి భిక్షం గెలుపొందారు. ఆ తర్వాత టీడీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ డైరెక్టర్లు 11 మంది కాగా, సీపీఐ, సీపీఎంకు ఒక్కొక్కరు ఉన్నారు. వెంకటరెడ్డి పదవి చేపట్టి ఈనెల 16కు మూడేళ్లు పూర్తి కావడం, రాజకీయ పరిణామాలు మారిన నేపథ్యంలో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్‌కు చెందిన ఏడుగురితో పాటు సీపీఎం, సీపీఐ సభ్యులు ఇద్దరు మొత్తం 9 మంది సిద్ధమయ్యారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమవుతున్న ఇల్లు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నఆర్లగూడెం గ్రామానికి చెందిన కారం వీరభద్రం ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంట్లోని వ్యక్తులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో 10 బస్తాల ధాన్యం, 5 క్వింటాళ్ల పత్తి, ఇంటి సామగ్రి, బట్టలు, పుస్తకాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది.

సాగర్ కాల్వలో పడి వివాహిత మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు పడిన వివాహిత మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాదారపు రాజేశ్వరి(35) బట్టలు ఉతికేందుకు సాగర్ కాల్వకు వద్దకు వెళ్లగా తలపై ఉన్న చుట్టుగుడ్డ నీళ్లలో పడింది. దీనిని తీసే క్రమంలో నీళ్లలో పడిన రాజేశ్వరి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా చేపలు పడుతున్న కొందరు గమనించి ఆమెను బయటకు తీసుకొచ్చారు. అనంతరం బంధువులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకునేలోగానే రాజేశ్వరి మృతి చెందింది. ఆమె తండ్రి నంద్యాల అప్పయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు కృషి

వోల్వో గ్రూప్ ఇండియా డైరెక్టర్ జీ.వీ.రావు


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీ.వీ.రావు తదితరులు

బూర్గంపాడు: గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు సరఫరా చేయడమే లక్ష్యంగా వోల్వో గ్రూప్ ఇండియా సంస్థ సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తుందని సంస్థ డైరెక్టర్ జీ.వీ.రావు అన్నారు. ఇరవెండి గ్రామంలో బుధవారం రూ.7లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీసీ పీఎస్‌పీడీ సౌజన్యంతో ఇరవెండిలో ఈ పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. 24 గంటల పాటు ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఈ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా స్థలదాత తాళ్లూరి పంచాక్షరయ్యను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వోల్వో సంస్థ అధికారులు సుమంత్‌కుమార్, వెల్లంకి కృష్ణకిశోర్, ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి, శ్యామ్‌కిరణ్, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ కొర్సా లక్ష్మీ, వల్లూరిపల్లి వంశీకృష్ణ, జలగం జగదీష్, కనకమేడల హరిప్రసాద్, తాళ్లూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.

పిల్లలపై ప్రేమ, ఆప్యాయత ప్రదర్శించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ తార

టేకులపల్లి: అంగన్‌వాడీ టీచర్లు పిల్లలపై ప్రేమ, ఆప్యాయత చూపుతూ వారిని తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కే.ఎం.తార, ఏసీడీపీఓ అరుణకుమారి సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మూడు మండలాల అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేయగా వారు మాట్లాడారు. పిల్లలు ఆనందంగా కేంద్రానికి వచ్చేలా ఏర్పాటుచేయడమే కాక మానసిక ఒత్తిడికి గురికాకుండా ఆటపాటలతో బోధన చేయాలని సూచించారు. అలాగే, మెనూ ప్రకారం భోజనం, న్యూట్రీ గార్డెన్ నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. ఇక బాల్య వివాహాలు, గృహహింస తదితర ఘటనలు అంగన్‌వాడీ టీచర్ల దృష్టికి వస్తే సఖి సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్‌తో పాటు శివకుమారి, నాగిరెడ్డి, కె.అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, యశోదమ్మ, విజయకుమారి, నిర్మల, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జీడీసీలో సర్టిఫికెట్ కోర్సు షురూ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీటీ టూల్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ కోర్సును కళాశాల ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ టూల్స్ ప్రాధాన్యత ఎంతో ఉందని తెలిపారు. 45 రోజులపాటు ఉండే ఈ కోర్సులో విద్యార్థులు కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం గూగుల్ టూల్స్ ఉపయోగించుకుని ఉన్నత విద్యలో ఎలా రాణించవచ్చో ఆయన వివరించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాంబాబు, ఎస్.విమల, కె.రాంబాబు, కె.దీపిక, పూర్ణచందర్‌రావు, కె.కార్తీక్, ఎ.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య


కార్తీక్ మృతదేహం

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో స్థిరపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కొనతమాత్మకూరుకు చెందిన పరుచూరి కార్తీక్(38) పదిహేనేళ్ల క్రితం ఖమ్మం వచ్చి ఇక్కడే స్థిరపడి వివాహం చేసుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆయన మమతా రోడ్డులోని హయగ్రీవ అపార్ట్‌మెంట్‌లో ఉంటుండగా, ఇటీవల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే మంగళవారం ఉదయం వాకింగ్ కోసం లకారం ట్యాంక్ బండ్ వద్దకు వెళ్లిన ఆయన ఎంతసేపటికీ రాకపోవటంతో భార్య కృష్ణకుమారి బంధువులకు సమాచారం ఇవ్వగా ఎక్కడా గాలించినా ఫలితం లేకపోవడంతో ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం ఉదయం లకారం చెరువులో మృతదేహం తేలుతుండడంతో వాకింగ్‌కు వచ్చిన వారు ఇచ్చిన సమాచారం మేరకు వన్ టౌన్ సీఐ చిట్టిబాబు, ఎస్ఐ వెంకటేశం చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో బోటులో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. అనంతరం కార్తీక్ మృతదేహాన్ని గుర్తుపట్టిన స్నేహితులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, ఆయన ఆత్మహత్యకు స్పష్టమైన కారణాలు తెలియరాలేదు.

ఉరి వేసుకుని వ్యక్తి..

కల్లూరు రూరల్: కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్ రావు(35) భార్య బుధవారం కూలీ పనులకు వెళ్లగా ఎవరూ లేని సమయాన ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘు తెలిపారు.

ఈనాడు 'కొట్టు'కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ కట్టుకథనం

అవి పాత ఫొటోలని నిర్ధారించి.. ఉతికి ఆరేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులు

(సాక్షి, అమరావతి)

'ఈనాడు'పత్రిక ఎందుకింతలా దిగజారిపోతోంది? ఒక పార్టీపై బురద జల్లడానికి.. ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చడానికి... పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటానికి... మనుషుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి రెండేళ్ల కిందటి ఫొటోలు కూడా ఇవ్వాళ్టివేనని అబద్ధాలు చెబుతూ ప్రచురించే స్థాయికి ఎందుకు పడిపోయింది? అసలిలాంటి పత్రికను ఎవరైనా నమ్మొచ్చా? చంద్రబాబును అధికార పీఠంపైకి తేవటం కోసం ఈ రాష్ట్రాన్ని ఏం చేసినా పర్వాలేదనుకునే రామోజీరావు మనస్తత్వాన్ని క్షమించవచ్చా?

'పట్టాభినీ కొట్టారు'అంటూ పతాక స్థాయిలో వేసిన శీర్షికలోనే కాదు... ఆ వార్తలో ప్రతి అక్షరం అబద్ధాలతో కూడిన కాలకూట విషమే. అసలు పట్టాభిని కొట్టనే లేదని పోలీసులు కోర్టులో చెబితే... దాన్ని వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ 'ఈనాడు'లో వార్తలేంటి? పైపెచ్చు... 'తీవ్రంగా కొట్టారు. అరచేతిపైనా, కాళ్లపైనా థర్డ్ డ్రిగీ ప్రయోగించారు'అంటూ దుర్మార్గపు రాతలేంటి? ఆ రాతలన్నీ నిజమని నమ్మించటానికి వాటికి రుజువులుగా ఎప్పుడో రెండేళ్ల కిందట '2021 ఫిబ్రవరి 3న'తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ ఇపుడు వేసేసిన దౌర్భాగ్యపు పరిస్థితేంటి? అంటే... మీ దృష్టిలో మీ పాఠకులంతా వెర్రివాళ్లా రామోజీరావు గారూ? మీరు ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అదంతా ఒక చరిత్ర అని... 'సాక్షి'రాకముందు కొన్నాళ్లపాటు తెలుగు పత్రికారంగం ఎదుర్కొన్న సంధికాలమని ఇప్పటికీ తెలియటం లేదా? 'సాక్షి'ఆవిర్భవించిన నాటి నుంచీ మీ ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందని... వార్తలకు రెండోవైపున ఏమున్నదో కూడా జనం చూస్తున్నారని మరిచిపోయారా? ఇంటర్నెట్ వేదికగా వ్యక్తులే శక్తిమంతమైన మీడియాగా మారుతున్న ఈ రోజుల్లోనూ మీరు పచ్చి అబద్ధాలను పోగేస్తే నమ్మేస్తారని ఎలా అనుకుంటున్నారు? అసలు ఏనాటికైనా మారుతుందా 'ఈనాడు'?

'బీసీ'ల అభ్యున్నతి జనానికి చేరకుండా...

సోమవారం శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తూ... ఉన్న 18 స్థానాల్లో 14... అంటే ఏకంగా 68 శాతాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయిస్తూ కొత్త చరిత్రను లిఖించారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఎక్కడికక్కడ ముఖ్యమంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆనందంతో ర్యాలీలు చేశారు. ఇప్పటికే బీసీల్లో బలం పెంచుకున్న వై.ఎస్.జగన్‌కు... దీని వల్ల మరింత ఖ్యాతి వస్తుందని భావించిన తెలుగుదేశం, దాని మిత్ర మీడియా... వ్యూహం ప్రకారం అదేరోజున 'గన్నవరం'కుట్రకు తెరతీశాయి. తామే రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వటమే కాక... విజయవాడ నుంచి గన్నవరానికి వెళ్లి మరీ పట్టాభి సహా టీడీపీ నేతలు అక్కడి ఎమ్మెల్యే వంశీ అనుచరులతో ఘర్షణకు దిగారు. దాదాపు అన్ని ఛానెళ్లలోనూ బీసీలకు పట్టం కట్టిన వ్యవహారం రాకుండా... టీడీపీ చక్రం తిప్పింది. మంగళవారం నాడు 'ఈనాడు'లో ... గన్నవరంలో ప్రభుత్వమే దారుణాలకు పాల్పడ్డట్టుగా... పోలీసులే దౌర్జన్యం చేసినట్లుగా దారుణమైన కథనాలు వండివార్చేశారు. ఆ ఘర్షణల సందర్భంగా అరెస్టయిన పట్టాభిని పోలీసులు దారుణంగా కొట్టారంటూ బుధవారం దాన్ని కొనసాగించారు. అందుకు రుజువులుగా ఎప్పుడో 2021 ఫిబ్రవరి 3నాటి ఫొటోలను... ఇప్పటివేనంటూ వేసేశారు. అదీ జరిగిన కథ!!. ఔరా రామోజీ??

2021, ఫిబ్రవరి 3 'ఈనాడు'ఏం రాసిందంటే

'కర్రలు, రాడ్లతో పట్టాభిపై దాడి'అని 'ఈనాడు' బ్యానర్‌గా ప్రచురించిన వార్త ఇది. టీడీపీ నేత పట్టాభిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ 'ఈనాడు'హడావుడి చేసింది. విజయవాడలోని తన ఇంటి నుంచి కారులో వచ్చిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని... కారు అద్దాలు పగలగొట్టారని... పట్టాభిని కారు నుంచి బయటకులాగి... ఎడమ మోచేయి, ఎడమ మోకాలు, తొడపై ఇష్టారాజ్యంగా కొట్టారని వార్త ప్రచురించింది. తన భర్తకు ప్రాణహాని ఉందని పట్టాభి భార్య చందన ఆవేదన వ్యక్తం చేసినట్టు మరో వార్త ఇచ్చింది. పోలీసులు స్పందించి ఆ దాడిని మెడికో లీగల్ కేసుగా నమోదు చేస్తాం... ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తామంటే పట్టాభి వద్దన్నారని, దాంతో... పోలీసులు బలవంతంగా ఆయన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారని ఇంకో వార్త వేసింది. పట్టాభికి సంఘీభావంగా చంద్రబాబు హుటాహుటిన ఆయన నివాసానికి వచ్చి పరామర్శించటమే కాక... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చంపేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన వార్త కూడా వేసింది. ఇక పట్టాభి శరీరంపై గాయాలు... పట్టాభిపై దాడికి ఉపయోగించిన కర్ర... ధ్వంసమైన పట్టాభి కారు అద్దాలు...పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళుతుండటంతో విలపిస్తున్న పట్టాభి... పట్టాభిపై దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన తరువాత పోలీసులతో మాట్లాడుతున్న చంద్రబాబు... పట్టాభి శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న చంద్రబాబు... అంటూ పెద్దపెద్ద ఫొటోలతో విపరీతమైన హడావుడి చేసి... రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందనే భావన కలిగించాలని కుట్ర పన్నింది.

కానీ... ఆ కుట్ర బెడిసికొట్టింది

చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే ఆ దాడి గురించి ఫిర్యాదు చేయడానికి పట్టాభి ఇష్టపడలేదు. ఎవరిపైనయినా అనుమానం ఉందా? అంటే కూడా చెప్పలేదు. పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. పోలీసులు దర్యాప్తు జరపటానికే ఆయన ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? వాస్తవానికి పట్టాభికి సంబంధించిన వ్యక్తిగత రహస్యాలు, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కొందర్ని

పట్టాభిని పోలీసులు కొట్టనే లేదు

వైద్య పరీక్షల్లో నిర్ధారణ

పట్టాభిని పోలీసులు కొట్టారన్న టీడీపీ ఆరోపణలు అవాస్తవమని స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో పట్టాభికి విజయవాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు రెండు సార్లు పరీక్షించి మరీ ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దాంతో తనను కొట్టారంటూ పట్టాభి ఆడిన డ్రామా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన అవాస్తవ ఆరోపణలు... రాష్ట్రంలో ఐపీసీ కాదు వైసీపీ అమలు అవుతోందంటూ ఈనాడు చేసిన దుష్ప్రచారం అంతా పక్కా ముందస్తు కుట్రేనన్నది స్పష్టమైంది.

ఆయన చేసిన మోసాలు అప్పట్లో కథలుకథలుగా వినిపించాయి. తన వ్యక్తిగత రహస్యాలను బయట పడకుండా బ్లాక్‌మెయిలింగ్ చేసేందుకు పట్టాభే ఆ దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గాలు లోలోపల వ్యాఖ్యానించాయి కూడా. ఇవన్నీ బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఆయన దర్యాప్తునకు ఇష్టపడలేదు. దీంతో పట్టాభిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది.

అయినా... మనసు మారలేదు


అప్పట్లో చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టినా... 'ఈనాడు'మాత్రం మారలేదు. మళ్లీ బుధవారం నాడు పాత స్కీమునే పునరావృత్తం చేసింది. పట్టాభి అరికాళ్లు, తొడలపై దెబ్బలు అంటూ అలనాటి 5 ఫొటోలను మొదటి పేజీలో ప్రచురించింది. 'దేశమంతా ఐపీసీ చట్టం.. రాష్ట్రంలో వైసీపీ చట్టం' అంటూ మరో కథనంతో మొదటి, రెండు పేజీలను నింపేసింది. 'నా భర్త ప్రాణాలకు ముప్పు'అంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టుగా మరో వార్తను ఏకంగా అయిదు ఫొటోలతో ప్రచురించి 3వ పేజీని నింపేసింది. 'ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా'అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు మరో వార్త కూడా వేసింది. అంటే... రెండేళ్ల కిందటి ఘటనతో బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ ఆ స్కీమ్‌ను పునరావృత్తం చేశారు రామోజీరావు గారు. కాకపోతే మధ్యాహ్నానికల్లా సోషల్ మీడియాలోనే అందరూ నిజానిజాలు చెబుతూ 'ఈనాడు'వలువలు ఊడదీసేశారు. ఇప్పటికైనా రామోజీ మారతారా?

గోదారికి కరకట్టలతో కట్టడి!

నదికి ఇరువైపులా రూ.8వేల కోట్లతో 16కి.మీల మేర నిర్మాణం

- కుడి వైపున సంజీవరెడ్డిపాలెం- అమ్మగారిపల్లె వరకు
- ఎడమవైపున సుభాష్‌నగర్ కాలనీ–సున్నంభట్టి వరకు
- రూ.1629 కోట్లు, రూ.1587 కోట్లతో వేర్వేరు ప్రతిపాదనలు
- భూసేకరణకు రూ.230 కోట్ల––రూ.250 కోట్ల అంచనా వ్యయం
- రూ.25 కోట్లతో రెడ్డిసత్రం, కొత్త కాలనీల్లో రెండు పంప్‌హౌజ్‌లు
- వీటి ద్వారా వాగుల్లోని వరద నీరు గోదావరిలోకి ఎత్తిపోత
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు వరదల నుంచి రక్షణ కోసం గోదావరి నదికి ఇరు వైపులా 16 కి.మీల పొడవున కరకట్టలు నిర్మించాలని నిపుణుల కమిటీ ప్రతిపాదించింది. గోదావరికి కుడి వైపున బుర్గంపహాడ్ మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె వరకు, ఎడమవైపున భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీ నుంచి దుమ్ముగూడెం మండలం సున్నంభట్టి వరకు కొత్త కరకట్టలు నిర్మించడంతో పాటు ఇప్పటికే కరకట్టలు ఉన్న చోట వాటిని బలోపేతం చేయాలని సూచించింది. ఇందుకు రూ.1629 కోట్లు, రూ.1587 కోట్ల అంచనాలతో రెండు వేర్వేరు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాది జూలైలో గోదావరి నదికి వరదలు భీకరంగా పోటెత్తడంతో భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. జూలై 17న



సీఎం కేసీఆర్ భద్రాచలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరదల నుంచి శాశ్వత పరిష్కారం కల్పించడానికి రూ.1000 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్ర రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ వరదల నుంచి శాశ్వత పరిష్కారంపై అధ్యయనం జరిపి ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

రూ.8వేల కోట్లతో కరకట్టలు !

వరద రక్షణ గోడల పనుల కోసం తొలి ప్రతిపాదన ప్రకారం భూసేకరణ నిర్వహిస్తే రూ.237 కోట్లు, మరో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.253.1 కోట్లు వ్యయం కానుందని కమిటీ అంచనా వేసింది. ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రతిపాదించింది. దాదాపు 230–250 ఎకరాల వరకు భూసేకరణ జరపాల్సి ఉండనుంది. కరకట్టల నిర్మాణానికి తొలి ప్రతిపాదన అనుసరిస్తే రూ.8329.75 కోట్లు, రెండో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.8443.9 కోట్లు కానుందని తెలిపింది. కరకట్టలతో పాటు 15 మైనర్ స్ట్రక్చర్లు, 2 మీడియం స్ట్రక్చర్లు, 6 మేజర్ స్ట్రక్చర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించింది.

పంపులతో గోదావరిలోకి వాగుల నీళ్లు ఎత్తిపోత

వరదల సమయంలో గోదావరిలో బ్యాక్‌వాటర్ వెనక్కి తన్నుతుండడంతో సమీపంలోని వాగుల ప్రవాహం అందులో కలవలేక ఎక్కడికక్కడే పేరుకుపోయి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా భద్రాచలంలోని రెడ్డిసత్రం, కొత్త కాలనీల వద్ద రూ.25 కోట్ల అంచనాలతో రెండు పంప్‌హౌజ్‌లు నిర్మించి వరద నీళ్లను ఎత్తి గోదావరిలో పోయాలని కమిటీ సూచించింది. బీటీ రోడ్లు, అప్రోచ్ రోడ్ల కోసం మరో రూ.6.75 కోట్లను ప్రతిపాదించింది.

ఏపీలో 175 సీట్లలో బీఆర్ఎస్ పోటీ: తోట

గుంటూరు మెడికల్: రానున్న ఎన్నికల్లో 175 ఎమెల్యే, 25 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ చేయనుందని, ఏపీలో బీఆర్ఎస్ మూడో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఆవిర్భవిస్తున్నదని బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయనకు బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికాయి. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమలలోని గోకులం కార్యాలయంలో బుధవారం నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. తిరుమలలో ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు 150 శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నారు. మార్చి నుంచి 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, 400 టికెట్లు తిరుమలలోని గోకులం కార్యాలయంలో, 100 తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద భక్తులకు అందుబాటులో ఉంటాయి.

పట్టాభిని కొట్టామనడం

అవాస్తవం

- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టీడీపీ నేత పట్టాభికి 14 రోజుల రిమాండ్

- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ధ్రువీకరణ
- ఈ మేరకు మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు

కరకట్టలను నిర్మించాలని ఏపీని కోరనున్న ప్రభుత్వం...


పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతోనే భద్రాచలం, పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించే పనులను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం/పోలవరం ప్రాజెక్టు అథారిటీని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కోరనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో ఏర్పడనున్న ముంపు సమస్యకు పరిష్కారం కల్పించాలని గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీతో పాటు కేంద్రాన్నీ కోరుతున్న విషయం తెలిసిందే. ముంపునకు గురవుతున్న భూముల సేకరణ లేదా కరకట్టలతో వాటికి రక్షణ కల్పించంలో ఏదైనా ఒక పనిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ/ఏపీ ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని తెలంగాణ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా వార్తలు

'ఓపెన్' ఫీజు చెల్లింపునకు అవకాశం

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెం అర్బన్: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన అభ్యర్థులు తత్కాల్ విధానంలో పరీక్ష ఫీజు చెల్లించేందుకు మార్చి 4వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని ఖమ్మం, భద్రాద్రి డీఈఓలు సోమశేఖర శర్మ, ఎస్ఎస్ఎస్.ప్రసాద్, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. సాధారణ పరీక్ష ఫీజుతో పాటు అదనంగా పదో తరగతి వారైతే రూ.500, ఇంటర్ అభ్యర్థులైతే రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. www. telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా కానీ మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్ లో కానీ ఫీజు చెల్లించవచ్చని వారు తెలిపారు.

ఎగబాకిన మిర్చి ధర



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర ఒక్కసారిగా ఎగబాకింది. విదేశాల్లో మిర్చికి డిమాండ్ ఉండటంతో ధర పెరిగినట్లు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చి క్వింటాకు మంగళవారం రూ.18,500 ధర పలకగా.. బుధవారం రూ.600 పెరిగి రూ.19,100గా నమోదైంది. ఈనెల ఆరంభంలో రూ.18వేల నుంచి రూ.18,200 వరకు పలికిన ధర రెండు, మూడు వారాల్లో క్రమక్రమంగా పుంజుకుంది. మార్కెట్‌కు బుధవారం 51,561 బస్తాల మిర్చి విక్రయానికి రావడం, చైనా నుంచి ఎగుమతిదారులకు ఆర్డర్లు ఉండటంతో ధర పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇక తాలు మిర్చికి సైతం మార్కెట్‌లో గరిష్టంగా రూ.10,800, కనిష్టంగా రూ.7,500 ధర పలికింది. కాగా, కొనుగోళ్లను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి అధికారి రుద్రాక్షల మల్లేశం పర్యవేక్షించారు.

శిక్షణకు సిద్ధం



కేటీపీఎస్‌లో నిర్మించిన శిక్షణ కేంద్రం

- కేటీపీఎస్ కేంద్రంగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు
- రూ. 8.50 కోట్లతో పనులు పూర్తి
- శరవేగంగా కేటీపీఎస్ ఓఅండ్ఎంలో ఆక్సిజన్ ప్లాంట్

పాల్వంచ: టీఎస్ జెన్‌కో పరిధిలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ కేంద్రంగా విద్యుత్ ఉద్యోగుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.8.50 కోట్లతో ఈ సెంటర్ నిర్మాణం పూర్తి చేశారు. మారుతున్న సాంకేతికతపై ఉద్యోగులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి, పూర్తి స్థాయి నైపుణ్యాన్ని తీసుకొచ్చేందుకు ఈ ట్రైనింగ్ సెంటర్ ఎంతో అవసరం. బ్యాచ్‌ల వారీగా రాష్ట్రంలోని వివిధ జనరేటింగ్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తారు. రోజువారీగా తరగతుల నిర్వహణ, భోజన వసతి, సీఈ, ఎస్ఈ, ఇతర ఇంజనీర్లు, సిబ్బంది కోసం ప్రత్యేక గదులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లతో కూడిన భవనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీటీపీఎస్(విజయవాడ) కేంద్రంగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ ఉండేది. తెలంగాణ విభజన తర్వాత కేటీపీఎస్ కేంద్రంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లాలో కేటీపీఎస్‌తో పాటు, మణుగూరు బీటీపీఎస్ కేంద్రం ఉండడంతో అత్యధిక మంది ఉద్యోగులకు అందుబా టులో ఉండేలా ప్రస్తుతం పాల్వంచలోని పాత డీపీ వీ పాఠశాల ప్రాంగణంలో ట్రైనింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కాగా, యాజమాన్యం సీ కాలనీ సమీపంలో కొత్తగా ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించింది.

రూ.2.50 కోట్లతో సిమిలేటర్ గదులు..

రూ. 6 కోట్లతో శిక్షణ కేంద్రం నిర్మించగా, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని రకాల పరికరాలతో కూడిన సిమిలేటర్ గదులను రూ.2.50 కోట్లతో తీర్చిదిద్దారు. ఈ సిమిలేటర్ ద్వారా కర్మాగారాల్లో ఉండే టర్బైన్, ఈఎస్‌పీ, బాయిలర్ తదితర అన్ని విభాగాల పనితీరును నేర్చుకుని, యూనిట్ నిర్వహణ సిస్టంను నడిపించే సామర్థ్యాలను తెలియజేస్తారు.

సీఎండీ చేతుల మీదుగా ప్రారంభం..

జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు చేతుల మీదుగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీనే సీఎండీ పర్యటన ఉంటుందని మొదట ప్రకటించారు. ఆ తర్వాత 18వ తేదీకి వాయిదా పడినట్టు చెప్పినా.. అప్పుడు కూడా సీఎండీ రాలేదు. దీంతో త్వరలోనే ఆయన పర్యటన ఉంటుందని సమాచారం.

అభివృద్ధి పనుల్లో లోటుపాట్లు ఉండొద్దు

కేటీపీఎస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని టీఎస్ జెన్‌కో డైరెక్టర్(సివిల్) అజయ్ అన్నారు. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పనుల పురోగతి గురించి 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు యుగపతి, మోక్షవీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యాయి



జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. భవనంలో తరగతి గదులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాం. సిమిలేటర్ గదులు, పరికరాలనూ ఏర్పాటు చేశాం. త్వరలోనే జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

– శ్రీనివాసబాబు, ట్రైనింగ్ సెంటర్ సీఈ

ఆక్సిజన్ ప్లాంట్ పనులు పూర్తి..

కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో రూ.2.47 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. గాలి నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి చేసే కేటీపీఎస్ ప్లాంట్‌లో రోజుకు 1050 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్ తయారవుతుంది. దీంతో 7 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల 150 సిలిండర్లను నింపవచ్చు. రాష్ట్రంలోని ఇతర జనరేటింగ్ స్టేషన్లకు ఇక్కడి నుంచే సిలిండర్లను సరఫరా చేయనున్నారు. ఆయా కర్మాగారాల్లో వార్షిక మరమ్మతులు, ఇతర పనులకు ఈ సిలిండర్లను వినియోగిస్తారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల వినియోగం అధికంగా ఉండగా, కొన్ని సందర్భాల్లో కొరత కూడా ఏర్పడింది. వీటిని బయట కొనుగోలు చేయాలంటే ఒక్కో సిలిండర్ ధర రూ.500 పైనే ఉంటుంది.

పండుగలతో భక్తిభావం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: పండుగల ద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తొర్రూరు మండలం నాంచారిమడూరులోని శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం నిర్వహించగా మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గుంటుక యాదలక్ష్మి, ఎంపీటీసీ కుంభం సుకన్యరెడ్డితో పాటు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



మంత్రి దయాకర్‌రావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గుడుంబా నిర్మూలనకు చర్యలు

వరంగల్ ఎక్సైజ్ డీసీ అంజన్‌రావు

తొర్రూరు: ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడుంబా నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు తెలిపారు. తొర్రూరుకు బుధవారం వచ్చినాయన ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష అనంతరం మాట్లాడారు. గుడుంబా నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు, రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, నిందితులను బైండోవర్ చేస్తున్నామని, మళ్లీ అదే నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలుశిక్ష అమలుచేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వరద శ్రీనివాసులుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజన్‌రావు

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది ఉద్యోగులకు క్యాష్ అవార్డులు లభించాయి. డిపోలో బుధవారం జరిగిన సమావేశంలో వారికి ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత క్యాష్ అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు శ్రీనివాస్, రాణి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్ఎం ప్రభులత

డీసీసీబీ ఆధ్వర్యాన కొనసాగుతున్న జప్తు

నేలకొండపల్లి: ఐదేళ్ల క్రితం రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారి ఇళ్లలో సామగ్రిని డీసీసీబీ అధికారులు జప్తు చేస్తున్నారు. డీసీసీబీ నేలకొండపల్లి బ్రాంచ్ ఆధ్వర్యాన కొత్తకొత్తూరు, తిరుమలాపురంల్లో ఇటీవల పలువురి ఇళ్లలో సామగ్రిని జప్తు చేయగా, బుధవారం సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లిలో జప్తు చేపట్టారు. 2016–17తో పాటు 2019లో వివిధ గ్రూప్‌ల సభ్యులు రూ.20వేల చొప్పున తీసుకున్న జేఎల్‌జీ రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో వడ్డీతో కలిసి పేరుకుపోగా ఆస్తుల జప్తునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఇందు మాట్లాడుతూ పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిదారులు స్పందించకపోవడంతో జప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు సత్యాల కోటయ్య, ఖమ్మం వెంకటేశ్వర్లు, కనపర్తి నాగేందర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, నిరుపేదల విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగ్గాలేదని కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజని, బచ్చలకూరి నాగరాజు తదితరులు ఆరోపించారు.



బకాయిదారుల ఇంటి ఆవరణలో డీసీసీబీ మేనేజర్, ఉద్యోగులు

అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో యజ్ఞతారెడ్డి ప్రతిభ


ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంకు చెందిన యరమల యజ్ఞతారెడ్డి అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. చొప్పకట్లపాలెంలోని యరమల శ్రీనివాసరెడ్డి-విజయనిర్మల కుమార్తె యజ్ఞత హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతోంది. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన ఆమెను జాతీయస్థాయి జట్టులోకి ఎంపిక చేశారు. ఈనెల 16నుండి 19వ తేదీ వరకు తెలంగాణ ఇండియా ఫైనాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో యజ్ఞత సత్తా చాటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆటల్లోనే కాక చదువులో ప్రతిభ చాటుతున్న ఆమెను పలువురు అభినందించారు.



యజ్ఞతారెడ్డి

'న్యాక్' గ్రేడ్ అభినందనీయం

ఇల్లెందురూరల్: ఇటీవల న్యాక్ 'బీ' ప్లస్ గ్రేడ్ సాధించిన ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఉన్నత విద్య శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఇంద్రాణి, సభ్యుడు పిచ్చయ్య తదితరులు బుధవారం హైదరాబాద్‌లో కమిషనర్‌ను కలిశారు. కళాశాలలో టాస్క్ సెంటర్, వర్చువల్ క్లాస్‌రూం, గ్రంథాలయం, ఫిట్‌నెస్ సెంటర్, ఆర్ఓ ప్లాంట్ తదితర ఏర్పాట్లతో న్యాక్ గ్రేడ్ లభించిందని వివరించారు. ఈ సందర్భంగా నవీన్ అభినందించడమే కాక ఇదే స్ఫూర్తితో పనిచేసి మరింత మెరుగైన గ్రేడ్ సాధనకు కృషి చేయాలని సూచించారని ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.



నవీన్‌మిట్టల్‌తో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు